# ఎదురు దాడి

"ఏయ్ మొద్దు...నిన్నే... లే" ఇంట్లో అడుగుపెడ్తూనే అరచినట్లుగా అన్నాడు మోహన్ నులక మంచంలో నిండా దుప్పటి కప్పుకొని పడుకొని ఉన్న భార్య జ్యోతిని ఉద్దేశించి.

"యేంది" అంది మొఖం మీది నుంచి దుప్పటి తొలగించుకొని భారంగా కళ్ళు తెరచి చిరాగ్గా అతనికేసి చూస్తూ జ్యోతి.

ఆమె కళ్ళల్లో ఎర్ర జీరలు కనిపిస్తున్నాయి. తలంతా చిందరవందరగా రేగి ఉంది. మొఖం వాడిపోయి ఉంది.

"యిగో... గీ చాపలు దెచ్చిన. చెరువుకట్ట కెయ్యిపోతే అక్కడ మనూరోళ్ళు చాపలు పడ్తాంద్రు. వాళ్ళతోటి ముచ్చట పెట్టుకుంట అక్కన్నే పొద్దుగూకేదాకున్న. వాళ్ళు నాకో కిలో చాపలు ఫ్రీగిచ్చింద్రు. నాకీ వూళ్ళె ఎంత పలుకుపడుందో దీన్ని బట్టన్న ఎరుకజేసుకో" అన్నాడు మోహన్ చేతిలో ఉన్న చేపల ప్యాకెట్ వైపు గర్వంగా చూస్తూ.

"నీకు పలుకుబడి లేదని ఎవరన్నరిప్పుడు" అంది జ్యోతి.

"నువ్వంటవుగదా 'గడియ తీరక లేదు. గవ్వరాబడి లేదు' అని. గది పోనియ్‌గాని, దబ్బున లేచి గీచాపలు కడిగి జర మంచిగొండాలె."

"నాకు చెప్పక చెయ్యక గిప్పుడీ చాపలెందుకు దెచ్చినవ్? నాకియ్యాళ పాణం బాగలేదు".

"అన్నీ నీకు చెప్పి చెయ్యాల్నా యేంది? గట్లాటి ఆశలు పెట్టుకోకు. అదునా ఆడదానివి. నీకు చెప్పేదేందే. మొగోడు చెప్పినట్టు జేసుడే ఆడదాని పని. నీ పాణానికేం గాలె. తిని పంటె గట్లనే ఉంటది. లేచి పని జేస్తాంటె అన్ని రోగాలు బోతయ్. జ్వరముంటే చెప్పు వో క్రోసిన్ గోలి తెచ్చిస్త. యేసుకోని ఓ టీ తాగినవంటె జరం గిరం పత్తా లేకుంటపోతది" అన్నాడతడు చేతిలో ఉన్న చేపల ప్యాకెట్‌ను తలుపుగూట్లో పెడ్తూ.

"క్రోసిన్ గోలితోటి తగ్గే జ్వరం కాదిది. కడుపుల నొప్పి లేస్తాంది. లేస్తే కండ్లు తిరుగుతున్నయ్. గిప్పుడు నేను గా చాపలు కడిగి వండలేను."

"యిగో... యిగో... గిట్ల మాట్లాడ్తెనే నావొళ్ళు మండుతది. నేను నా దోస్తులకు ఈ రాత్రికి మా యింటికి భోజనానికి రాంద్రని చెప్పొచ్చిన. గిప్పుడు వాళ్ళ దగ్గరికి బోయి 'నా ముద్దుల పెండ్లానికి పాణం బాగలేదు. మీరు రావొద్దు' అని చెప్పి రమ్మంటవా యేంది? గది మాత్రం జరగదు. నీ నొప్పి గిప్పి పక్కకు బెట్టి వంట జేస్తేనే గీ యింట్లుంటవు. లేకపోతే గిప్పుడే బయటికెళ్ళగొడ్త"

"పాణం బాగలేదంటే అర్థం చేసుకోవేంది? నాకు నెలనెలా బయటున్నప్పుడు గిట్ల కడుపుల నొప్పిలేస్తున్నదని, ఆ నాల్గురోజులు కడుపంతా పుండు సలిపినట్టు సలుపుతున్నదని, నన్నోసారి వరంగల్‌కు తీస్కపోయి డాక్టరమ్మకు చూపెట్టమని నీకెన్నిసార్లు చెప్పినగని నువ్వు తీస్కనే పోవైతివి."

"నిన్ను డాక్టరమ్మ దగ్గరకు తీస్కపోయేటందుకు నా దగ్గర పైసలెక్కడున్నయె దండుముండ? నీ అయ్యను తీస్కపొమ్మనకపోయినవ్. నీ అయ్య ఒక్క పైసియ్యకుంట నిన్ను నాకు తగులపెట్టిండు. యేమి లేనోనికి కూడ యియ్యాళ రేపు లక్ష రూపాయలిస్తాంద్రు. నాకింత భూముంది. గీ యిల్లుంది. టెన్త్ ప్యాసయిన. అందమైన పర్సనాలిటీ వుంది. ఆడోళ్ళు నేనంటే

పడి చస్తరు. నీ అసుంటి దరిద్రపుగొట్టుదాన్ని జేసుకున్నగని, ఇంకెవర్ని జేసుకున్నా నాకో యాభైవేలన్నా కట్నంగా వచ్చేది. గా డబ్బులెవరన్న పైరవీకార్‌కిచ్చి కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించుకుందామనుకున్న. మేనరికమని నీ అయ్య, మా అవ్వకలిసి నిన్ను నా కంటగట్టింద్రు. అప్పట్ల యెదకొచ్చిన ఆవోలె జర ఎర్రగబుర్రగున్నవని నేను కూడ నిన్ను చూసి మెత్తబడ్డ".

"ఎందుకట్ల మాట్లాడుతవ్? మా నాయన వున్న రెండెకరాల చెలకమ్మి ముప్పైవేలు దెచ్చి నీ చేతులబెట్టిండు. యింకేం జెయ్యమన్నవు? అల్లుడు చదువుకున్నోడు. యేదన్న ఉద్యోగం చేసి నా బిడ్డను సుఖపెడ్తడని ఆశ పడ్డడు."

"మహా యిచ్చిండులే ముదనష్టపు ముప్పై వేలు... అండ్ల మా చెల్లె పెండ్లి ఖర్చే సగం ఖతంజేసి పారేసే. గండ్ల నాకేం మిగిలింది? మన పెండ్లిజేసినప్పుడు. మీ నాయినేమన్నడు? మా చుట్టపోడొకడు ఎస్.ఐ నౌకరి జేస్తున్నడు గాయన్ను పట్టుకొని నీకు కానిస్టేబుల్ నౌకరి యిప్పిస్తనన్లే? యేదా కానిస్టేబుల్ నౌకరి? పెండ్లి కాంగనే అన్ని మరచిపోయిండు."

"ఆయన చేసేది ఆయన జేస్తనేవున్నడు కానిస్టేబుల్ ఉద్యోగానికి యాభై వేలు లంచం అడుగుతున్నరట.

"గదే మరి. మీ అయ్యను గా యాభై వేలిచ్చి నాకు కానిస్టేబుల్ నౌకరి యిప్పించమను. గప్పుడు నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్త."

"నన్నేం పూజించొద్దు. ఓ మనిషోలె జూస్తె చాలు ఆయన జేసే ప్రయత్నం ఆయన జేస్తనేవున్నడు."

"యేం జేస్తున్నడు? నీ మొఖం జేస్తున్నడు? పైన ఖర్చుగాకుండ నాకు నౌకరి రావాల్నని చూస్తున్నడు. మంత్రాలకు చింతకాయలు రాల్తయా? పైసలియ్యంది ఎవ్వడు జెయ్యడు. నిన్ను యింట్ల నుంచి బయటకెళ్లగొడ్తె. నువ్వు బొయ్యి ఆయన నెత్తిమీద కూర్చుంటె, గప్పుడు గని ఆయనకు వేడిపుడ్తది. యింకో రెండెకరాలమ్మి పైసలు కడ్తడు. అప్పుడుగని నాకు జాబొస్తది. ఇవ్వాళ్లో రేపో యేమన్న చెయ్యకపోతడా అని ఊరుకుంటోంటే నువ్వు మీదికిపోతున్నవు. నీ అయ్య మీదికిపోతున్నడు. మీ యిద్దరి పని జూస్తగని. యిప్పుడైతే లేచి గా చాపల పని చూడు".

"లేస్తె నా కండ్లు తిరుగుతున్నయి. పొద్దట్నించి పచ్చిమంచినీళ్ళు కూడ ముట్టుకోలే. కడుపుల పేగులు గుర్రుగుర్రుమంటున్నయి. గా చాపలు కడిగివండే పనయితే నాతోటి కాదు".

"నీ అవ్వ... నిన్ను ఎన్‌కౌంటర్‌జేసి పారేస్తనే, గట్ల మాట్లాడ్తే. నేనంటే యేమనుకుంటున్నవో. మంచి మాటకు లేస్తవా? లేదా?"

"నాతోటిగాదిప్పుడు. ఇదివరకు నీకెన్నిసార్లు చాపల కూర వండి పెట్టలేదు. నువ్వు నీ దోస్తుల తోటి ఎన్నిసార్లు పార్టీలు జేసుకోలేదు. మంచిగుంటె ఎంత పనన్న జేస్త. నేను పనికి భయపడేదాన్ని కాదు. ఇయ్యాళ పాణం బాగలేదు. నాతోటి కాదు అంటున్న."

"నా దోస్తుల ముందు నా ఇజ్జత్ దీస్తవానె. ఇప్పుడు గాకపోతె ఎప్పుడే నువ్వు జేసేది. గిట్ల అవసరమయినప్పుడు జెయ్యకపోతే నువ్వెందుకే ఈ యింట్లుండేది? మళ్ళ జెప్తున్న యిప్పుడు గనక ఈ పనిచెయ్యకపోతివీ... నువ్వు ప్రాణాలతో బతికుండవు. ఎన్‌కౌంటర్ జేసిపారేస్త."

"మాట మాటకు ఎన్‌కౌంటర్, ఎన్‌కౌంటర్ అంటవు... గదంటే యేందట?"

"యేడో తరగతిదాక చదివినవేమో, ఎన్‌కౌంటరంటె యెరుకలేదా? ఎన్‌కౌంటరంటె మసి... మనిషిని క్షణం సేపట్ల మసిజేసిపారేసుడు.... నల్లిని నలిపినట్టు నలిపిపారేసుడు... గది ఎన్‌కౌంటరంటె."

"గట్లనా? నువ్వేమన్నజేసుకో. నేనైతే యిప్పుడు లేవలేను."
"గంతేనా?"
"గంతే"
"లాస్ట్‌సారడుగుతున్న, గంతేనా?"
"గంతే".

క్షణంలో అతడామె దగ్గరకొచ్చి దట్టంగా వున్న ఆమె జుట్టు పట్టుకొని శక్తికొద్దీ లాగాడు. ఆమె మంచం మీది నుంచి దభీమని కింద పడిపోయింది.

ఆమె 'అమ్మా' అంటూ కెవ్వున కేకేసి అతని చేతుల్లోంచి విడిపించుకోవడానికి తన శక్తికొద్దీ పెనగులాడింది.

కానీ, అతడామెను అలాగే జుట్టు పట్టుకొని కొరకొరా ఇంటెనుకకు ఈడ్చుకుపోయాడు. ఆమె బాధతో విలవిల్లాడిపోతూ నెత్తి బాదుకుంది.

"లేచి పనిజేస్తవా, లేదా" అన్నాడతడు శక్తికొద్దీ ఆమె జుట్టు లాగుతూ.

"లేస్తె చస్త. నన్నొదిలిపెట్టు."

"లేవకపోతె నేనే చంపుత. ఎన్‌కౌంటర్ జేస్త... మసిజేస్త. నీ శవం కూడ మిగలకుండ చంపుత."

"చంపు. గిప్పుడే చంపు. నీ అసుంటి పశువు తోటి కాపురం జేసుడు కంటె చచ్చుడే నయం చంపు. యేపాటి చంపుతవో చంపు."

"నన్ను.... నన్ను పశువంటవా? నీ మొగన్ని పశువంటవా? నీకు ఒళ్ళు కొవ్వెక్కిందే."

ఒక చేత్తో ఆమె జుట్టు పట్టుకొని, మరో చేత్తో ఆమె వీపు మీద చరుపుల వర్షం కురిపిస్తూ ఆమెను చచ్చిన గొడ్డును లాక్కుపోయినట్టు లాక్కుపోసాగాడు.

"వదులు, వదులు... వదుల్తవా లేదా? వదుల్తవా లేదా?"

ఆమె తన శక్తినంతా కూడదీసుకొని పెనగులాడసాగింది. కానీ, అతని బలమైన చేతుల్లోంచి బయటపడలేకపోయింది చివరి ప్రయత్నంగా ఆమె అతని చేతిని శక్తికొద్దీ కొరికింది.

"అమ్మో" అంటూ అరచి అతడామెని వదిలేశాడు. ఆమె కొరికిన చోట గాట్లుపడి రక్తం కారింది. అతడు బాధతో విలవిల్లాడిపోయాడు. కళ్ళకు నీళ్ళొచ్చాయి.

తనామెకు అంతకంటె ఎన్నో రెట్లు అధికమైన బాధను కల్గించానని అతడు గుర్తించలేదు.

"నన్ను.... నీ మొగన్ని కాట్లు పడేటట్టు, నెత్తురొచ్చేటట్టు కొరుకుతవా? గింత బరితెగిస్తవా? నువ్వు ఆడదానివి కాదే. దయ్యానివి. కొరివిదయ్యానివి. నిన్ను బతకనిస్తె నన్ను చంపేసేటట్టున్నవు. నిన్ను చంపాలె. ఎన్‌కౌంటర్ జెయ్యాలె. ఏ.కె ఫార్టీ సెవెన్‌తో కాల్చిపారెయ్యాలె" అంటూ అతడు ఆమె మీదకు మళ్ళీ రాబోయాడు.

ఆమె దిగ్గున లేచి అక్కడే ఓ మూల పడున్న కత్తిపీటను చేతిలోకి తీసుకుంది.

"నా మీదకొచ్చినవంటె బతుకవు. ఈ కత్తిపీటతో నరుకత."

"నన్ను... నన్ను... నీ మొగన్ని నరుకుతవా? నేను చస్తె రేపు నువ్వు ముండమోస్తవు గదనే."

"ముండ మోస్తె ముండమోస్తిని. నన్ను గిట్ల జుట్టు పట్టుకొని చచ్చిన గొడ్డును గుంజుకపొయినట్టు గుంజుకపోతవా? పాణం బాగలేక పండుకున్నదాన్ని నీ కట్టెలసుంటి చేతుల్తోటి కొట్టి కొట్టి చంపుతవా? నేనూ మనిషినే. నాకూ పాణం వుంది. నాకు మొగునివైనంత మాత్రాన నన్ను గిట్ల చంపే హక్కు నీకుందనుకుంటున్నవా? గింత హింస పెడ్తె యే

అడదూరుకుంటది?” అందామె అతన్ని కాల్చేసేలా చూస్తూ. వెంట్రుకలన్నీ విరబోసుకొని కళ్ళలో నిప్పులు కురిపిస్తున్న ఆమె ఆ క్షణంలో భద్రకాళిలా కనిపించింది.

“ఊర్కోకపోతే పో. యిప్పుడే పో. నడువ్... బయటికి నడువ్.”

“మా నాయనిచ్చిన ముప్పై వేలుతేపోరా... యిప్పుడే పోత.”

“మీ నాయన ముప్పై వేలు నాకిచ్చిండా? మా అవ్వకిచ్చిండు. అది బోయి దాని బిడ్డదగ్గరుంది. దాన్నే అడుక్కోపో. అయినా, ముప్పై వేలు యే మొఖం పెట్టుకొని అడుగుతున్నవే? పెండ్లయిన రెండేళ్ళనించి నా యింట్ల పెట్టుకొని నిన్ను మేపిన ఖర్చెవడిస్తడే. నీ ముష్టి ముప్పై వేలు నిన్ను మేపినందుకే అయిపోయినయ్.”

“నీ యింట్ల నేనేం వూరికెనే కూర్చోని తిన్లేదు. ఎన్నోసార్లు కూలికి బొయి నా తిండి మందం తెచ్చుకున్న. నా పైసల్తోటి నీ చెల్లె పెండ్లి జేసినవు. ఇప్పుడు పొమ్మంటున్నవు. నా ఉసురు నీ చెల్లెకు తగుల్తది. పెద్ద మనుషుల్ని పిల్చి యిదేం న్యాయమో అడగందే పోతననుకోకు.”

“నా చెల్లెన్నేమన్న అంటివో, యిప్పుడే నరికి పోగులు బెడ్త.”

“చెల్లెల్ని అన్ననని ఎంత రోషమొచ్చిందో? అందరాడవాళ్ళు నీ చెల్లెలసుంటోళ్ళే అనుకోలేవ్?.”

“నువ్వు గిట్ల మర్ల బడ్తవని తెలిస్తే నిన్ను జేసుకునేటోన్నే కాదే. నీ పని గిట్లగాదుండు. నీ అసుంటి పొగరుబోతుదానికెట్ల బుద్ధి చెప్పాల్నో గట్లనే చెప్తవుండు” అంటూ మోహన్ ఇంట్లోంచి బయటికొచ్చాడు.

... ... ...

సాయంత్రం యేడయ్యింది. అప్పుడప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. విపరీతమైన కోపంతో మోహన్ వణికిపోతున్నాడు.

తనంతటివాన్ని, తననావూర్లో అందరూ ఆరడుగుల అందగాడంటారు. అంతటివాన్ని అదంత సులభంగా అడ్డగిస్తుందా? రక్తాన్ని కళ్ళకు చూపిస్తుందా? తను ఆర్మ్‌డ్ కానిస్టేబుల్‌గా మారి ఏ.కె. ఫార్టీసెవెన్ రైఫిల్‌తో వచ్చి దాని శరీరమంతా బులెట్లతో నింపేస్తే తప్ప తన కసి తీరదు. సలసల మరగిపోతున్న తన రక్తం చల్లారదు.

చిన్నప్పట్నించీ తనకు కానిస్టేబుల్ ఉద్యోగం చెయ్యాలన్న కోరిక. తన నాయన తన చిన్నప్పుడే పోయాడు. తాను తన చిన్నాయన దగ్గర పెరిగాడు. తన చిన్నాయన కానిస్టేబుల్‌గా పనిచేసేవాడు. ఎంత దర్జాగా, ఎంత ఠీవిగా నడిచిపోతుండేవాడాయన. మొదట్లో ఆయనకు పిల్లల్లేరని తననే పెంచుకుంటాడని అనుకున్నారు. కానీ, తనకు ఆరేండ్లు వచ్చేటప్పటికి చిన్నాయనకు పిల్లలు పుట్టారు. దాంతో అతడు తనను వదిలేశాడు.

నాయన సంపాదించిపోయిన కొంచెం భూముండేది. అమ్మ దాన్ని పట్టుకొని తననూ, చెల్లెనూ ఎలాగో పెంచి పెద్ద చేసింది. మేనమామ మొదట్నించీ ఏదో రకంగా సహాయం చేస్తూనే ఉన్నాడు. ఆ సాకుతోటే తన బిడ్డను, ఈ పొగరుబోతుదాన్ని తనకంటగట్టాడు.

మోహన్ అలా నడుస్తూ వెంకటేశం ఇంటిదాకా వచ్చాడు. అప్పుడు వెంకటేశం ఇంట్లోనే ఉన్నాడు.

“సారీ వెంకటేశం గారు, మా యింట్ల భోజనం అని చెప్పిన కద... కాన్సెలయింది. యింట్ల మా ఆడదాని పానం బాగలేదు” అన్నాడు మోహన్.

“దాందేముంది. మీ యింట్ల కాకపోతే మా యింట్ల భోంచేద్దాం. పార్టీ కాన్సెలయిందని నువ్వేం బాధపడకు కాస్సేపట్ల చెరువుకట్ట దాక నడుద్దాం. నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలె” అన్నాడు వెంకటేశం ఇంట్లోంచి బయటకొస్తూ.

"తప్పకుండ. పోదాం పాండ్రి" అన్నాడు మోహన్. ఇద్దరూ చెరువు కట్టవైపు నడవసాగారు. వీధిలో జన సంచారం ఎక్కువగా లేదు. వెంకటేశం మధ్యవయస్కుడు. చూడగానే గౌరవం కల్గించే రూపం అతనిది. ఎప్పుడూ తెల్లగా నిగనిగలాడే పైజామా, హాఫ్ షర్ట్ వేసుకుంటాడు. అక్కడక్కడ తెల్లవెంట్రుకలతో పైకి దువ్వుకున్న క్రాఫ్, చామన ఛాయ, బక్కపలచగా ఉంటాడు.

వెంకటేశం ఆ ఊరికి కొత్తగా వచ్చాడు. సోషల్ వర్కర్‌నని చెప్పుకుంటాడు.

పల్లెటూళ్ళల్లో నిరక్షరాస్యత. మూఢవిశ్వాసాలు, అపరిశుభ్రత లాంటి అనేక సమస్యలున్నాయని, వాటిని కొంతవరకైనా నిర్మూలించాలనే లక్ష్యంతో తనా వూరికొచ్చానని, తమకేదో రాష్ట్రస్థాయి సంస్థవుందని. ఆ సంస్థే తననావూరికి పంపించిందని కూడా అతడు ప్రచారం చేసుకున్నాడు.

అతడావూర్లో రాత్రి పాఠశాలనొకదాన్ని నడపడం మొదలెట్టాడు. వయోజనులు చాలా మంది ఆ పాఠశాలలో చేరారు. వెంకటేశం వాళ్ళకు చదువు చెప్పడమే కాకుండా, వైద్యం చెయ్యడం కూడా మొదలెట్టాడు. చిన్న చిన్న జబ్బులకు ఉచితంగా మందులిచ్చేవాడు. మూఢవిశ్వాసాలను పోగొట్టి ఆ ఊరి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానిక్కూడా అతడు కృషి చేశాడు. ఇలా చాలా త్వరగానే అతడా వూళ్ళో గొప్ప పలుకుబడిని సంపాదించాడు. ఊర్లో ఎవరికి ఎలాంటి అవసరం కల్గినా వెంకటేశం దగ్గరకే వెళ్తుండేవాళ్ళు. అలా ఒకసారి మోహన్ కూడా వెంకటేశం దగ్గరకు వెళ్ళి కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాలంటే ఏం చెయ్యలని అడిగాడు.

వెంకటేశం కానిస్టేబుళ్ళ రిక్రూట్‌మెంట్ ఎలా జరుగుతుందో. దానికి కావలసిన అర్హతలేమిటో రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన అడ్వర్టయిజ్‌మెంట్ వచ్చినప్పుడు మోహన్‌కు చెబుతానని, మోహన్‌కు కానిస్టేబుల్ ఉద్యోగానికి కావలసిన అర్హతలన్నీ ఉన్నాయని, ముఖ్యంగా చాలా మంచి పర్సనాలిటీ ఉందని, ఈ విషయంలో "నీకు నేను సహాయం చేస్తా"నని వెంకటేశం మోహన్‌కు చెప్పాడు. అప్పటినుంచి మోహన్ వెంకటేశం ఇంటి చుట్టూ తిరుగుతున్నాడు.

"నీకో మంచి అవకాశం వచ్చిందోయ్" అన్నాడు వెంకటేశం- వాళ్ళిద్దరూ చెరువుకట్టమీది కొచ్చాక.

"నాకా? యేందది" అన్నాడు మోహన్.

"నీకు కానిస్టేబుల్ ఉద్యోగం కావాలి కదా" అన్నాడు వెంకటేశం.

"వస్తదా? నిజంగా వస్తదా? దానికోసం యేం చెయ్యమన్న చేస్త."

"వస్తది. తప్పకొస్తది. నీకుకాకపోతే యింకెవరికొస్తుంది. ఆరడుగుల అందగాడివి. ఎత్తు ఎత్తుకు తగ్గ లావు. పహిల్వాన్‌లా కండలు తిరిగిన శరీరం. టెన్త్ ప్యాసయ్యావు. నీకు కానిస్టేబుల్ యేమిటి? కొంచెం ట్రై చేస్తే ఎస్.ఐ కూడా వస్తుంది."

"నిజంగొస్తదా? నాచేతికి రైఫిలొస్తదా? రివాల్వరొస్తదా? ఏకె ఫార్టీసెవనొస్తదా? చేతుల గన్ పట్టుకొని తిరగాల్నని, పొగరుబోతుల్నందర్నీ కాల్చిపారేయ్యాల్నని నాకో కోరిక. నా కోరిక తీరుతదంటరా?"

అలా మాట్లాడుతోంటే అతని రక్తం ఉప్పొంగింది.

తన చేతుల్లోకి నిజంగానే గన్ వచ్చినట్టు. ఆ గన్‌తో జ్యోతిలాంటి పొగరుబోతుల్ని కాల్చేస్తున్నట్టు ఫీలయ్యాడు.

"నీ కోరిక తీరుతుంది. కానీ, అందుకు నువ్వోపని చెయ్యాలె."

"యేం చెయ్యాల్నో చెప్పుండ్రి"

"నేను చెప్తున్న ఈ మాట ఎవరితోనూ చెప్పొద్దు" అన్నాడు వెంకటేశం గొంతు తగ్గించి.

"చచ్చినా చెప్ప...."

"యేం లేదు. ఈ మధ్య మనూరికి అర్ధరాత్రుళ్ళు ఎవరొస్తున్నరో చూస్తున్నవుగద. అన్నలమనీ ఒకడు. తమ్ముళ్ళమని ఒకడు ఊళ్ళళ్ళకొచ్చి నానా బీభత్సం సృష్టిస్తున్నారు."

"ఔనౌను, వాళ్ళు నన్ను కూడా రమ్మన్నరు గని నేను పోలే. వాళ్ళళ్ళ కలిస్తె కూడా చేతులకు గన్ వస్తది కదా. వాళ్ళు మళ్ళ పిలిస్తే పోదామా అని ఆలోచిస్తున్న...."

"వాళ్ళతో వస్తననే చెప్పు. వాళ్ళతో మంచిగున్నట్టే వుంటూ వాళ్ళమీదో కన్నేసి వుంచు. వాళ్ళు ఊళ్ళెకు ఎప్పుడొస్తున్నరు. ఎప్పుడు పోతున్నరు. ఎవరింట్ల వుంటున్నరు. ఇవన్నీ గమనించి నాకు చెప్పాలె."

"అర్థమైంది సార్. ఓసారి వాళ్ళను మా యింటికే రమ్మంట. వాళ్ళందరు నాకు తెలిసినోళ్ళే. మా యింట్లనే వాళ్ళకు భోజనాలు పెట్టిస్త... షెల్టరిస్త"

"జాగ్రత్త! ఈ పని చాలా జాగ్రత్తగ చెయ్యాలె. మూడో కంటికి తెలియకూడదు. ఈ పనిలో నువ్వు సక్సెసయినవో, నీకు కానిస్టేబుల్ జాబ్ గ్యారంటీ" అన్నాడు వెంకటేశం.

.... .... ...

మూడు నెలలు గడిచాయి. మోహన్‌కు ఆ ఊరికి దగ్గర్లో వుండే ఓ ప్రైవేట్ స్కూల్లో డ్రిల్ మాస్టర్ ఉద్యోగం దొరికింది. దాంతో రోజూ తెల్లప్యాంట్, తెల్లషర్ట్‌తో ఇన్‌షర్ట్ వేసుకొని స్కూల్‌కెళ్ళొస్తుండేవాడు.

మూడు నాల్గురోజులకొకసారి జ్యోతితో గొడవపడడం, ఆమెను కొట్టడం. ఆమె తిరగబడడం యధావిధిగా జరుగుతూనే ఉంది.

ఆ రోజు సాయంత్రం చీకటి వడ్తుండగా మోహన్ ఇంటికొస్తూనే వంట పనిలో ఉన్న జ్యోతిని చూసి "ఈ రోజు రాత్రి నువ్వు నాయింట్ల వుండొద్దు. పక్కింటి రాధమ్మింటికి పోయి పడుకో" అన్నాడు.

"నేనెక్కడికీ పోను. పెద్ద మనుషుల్ని పిలిచి నీ తప్పేందో, నా తప్పేందో చెప్పమందాం. నా తప్పయితె నేను వెళ్లిపోతా... అప్పటిదాకా నేనెక్కడకీ పోను" అంది జ్యోతి.

"నిన్ను మొత్తమే పొమ్మంటలేను లేవే. ఈ ఒక్క రాత్రికే పొమ్మంటున్న. దోస్తులొస్తున్నరు. పార్టీ జేసుకుంటున్నం. మంచి మాటకు చెప్తున్న... ఈ ఒక్క సహాయం చెయ్యి" బతిమాలుతున్నట్లుగా అన్నాడతడు.

"దోస్తులా, రమ్మను... పార్టీ జేసుకోండ్రి. యేమన్న వండిపెట్టమంటె వండిపెడ్తా. గిదీనికి నన్నెందుకు బయటకు పొమ్మంటున్నవు? నిన్ను పార్టీ చేసుకొవద్దంటలేనుగదా."

"చాలా మందొస్తున్నరు. మా స్కూల్లో పనిజేసేటోళ్ళందరూ వస్తున్నరు. గంతమంది ముందు యేడ్పుమొఖం పెట్టుకొని నువ్వెక్కడుంటవు? మంచి మాటకు పోతవా? లేదా? కూలికి పోయేదానివి నాయింట్లుంటె నా పరువుబోతది. అందుకే పొమ్మంటున్నా."

"పోను... యేంజేస్తవు? మల్లోసారి కొడ్తవు...గంతేకద.... కొట్టు. నీ కసిదీర కొట్టు. నా వొళ్ళు నువ్వు కొట్టిన దెబ్బలతోటి మొద్దుబారిపోయింది."

"నిన్ను కొట్టనే... కొట్ట. కొడ్తె నీకు బుద్ధి రాదు. నిన్ను ఎన్‌కౌంటర్ జేస్తగని కొట్ట. ఈ ఒక్కరోజు నా మాట విను. మన పక్కింటి రాధమ్మ నీకు దోస్తే గదా. ఇద్దరు గలిసి సారా తాగొద్దనీ ఊర్లెపెద్ద పోరాటం జేస్తిరిగదా. గా రాధమ్మింటికి బోతె యేమైతది? నాకీ ఒక్క మేలు చెయ్యి... నీ మొగున్ని బతిలాడ్తున్న గాదె. ఇప్పట్నించి నిన్ను కొట్టనే కొట్ట."

"నువ్వింత బతిలాడ్తున్నవంటె, నీ ఎత్తేందో గిప్పుడు తెలిసింది."

"యేందే నీకు దెలిసింది?"

"నన్ను బయటకు పంపి దాన్ని తెచ్చుకోనికులుకుతవు."

"దేన్ని?"

"అదే... నువ్వు పన్జేసే స్కూళ్ళ టీచరమ్మగజేస్తున్నదట కదా. మొన్నోసారి నేను కూలికి బోయినప్పుడు దాన్ని పట్టపగలే యింటికి దెచ్చుకున్నవట కదా. అది గినుక మళ్ళోసారి యిటుపక్కకొచ్చిందో... దాని కాళ్ళు నరుకుత."

"అంతకంటె ముందు నేను నీ తల నరుకుత. యేంజేస్తవే నువ్వు? అందునా ఆడదానివి. నేను మొగోన్ని...యేంజేసినా చెల్లుతది. రేపు దాన్ని పెండ్లి కూడ జేసుకుంట. ఎవడడ్డమొస్తడో చూస్త."

"గట్లనా. నేనూ జూస్త. నేను బతికుండంగ యింకో దాన్నెట్ల జేసుకుంటవో."

"నువ్వు బతికుంటె గద. నిన్ను ఎన్‌కౌంటర్ జేస్త. నిన్ను యమలోకానికి పంపినంకనే దాన్ని జేసుకుంట."

"నన్ను యమలోకానికి బంపుతవా? ఎట్ల బంపుతవో జూస్త. రేపు మనూరికి అన్నలొస్తరట. వాళ్ళతోటి చెప్పుకుంట. నేనేం తప్పు జేసిన్నని నువ్వు నాకింత అన్యాయం జేస్తున్నవో అన్నల్నే అడుగుత."

"అడగవే అడుగు. అన్నలంటే నాకు భయమనుకున్నవా? వాళ్ళందరు నా దోస్తులే. నా తోటి చదువుకున్నోళ్ళే. వాళ్ళు నన్ను కూడా రమ్మంటున్నరు. ఇవ్వాళ్ళో రేపో నేను కూడా వాళ్ళళ్ళ కలుస్తనేవుంటిని... రేపు అన్నలు మనూరికి వస్తరని నీకెట్ట తెలిసిందే?"

"ఎట్టనో తెలిసింది. గదంత నీకెందుకు?"

"నువ్వు కూడ వాళ్ళళ్ళ కలిసినవా యేంది?"

"నీ అసుంటోని తోటి కాపురం జేసిందానికంటె, వాళ్ళళ్ళ కలుసుడే నయం. ప్రజలకింత సేవజేసిన మన్న తృప్తి వుంటది."

"నేను కూడ గట్లనే అనుకుంటున్న. నీ అసుంటి రాకాసి ముండతోటి వుండుడు కంటె వాళ్ళళ్ళ కలుసుడే నయం. రేపు అన్నలు ఎవరింటికొస్తాంద్రట?

"ఎవరింటికెందుకు? నా యింటికే తీస్కొస్త... చాల సంగతులు, మనూరికి సంబంధించినవి, మనకు సంబంధించినవి మాట్లాడేదున్నది. మాట మాటకు ఎన్‌కౌంటర్ జేస్త... ఎన్‌కౌంటర్ జేస్త అంటున్నవు కద. నన్ను ఎన్‌కౌంటర్ జేసి యింకోదాన్ని జేసుకుంటనంటున్నవు గదా. గా సంగతులన్ని మాట్లాడదాం."

"మాట్లాడదాం. అన్ని సంగతులు మాట్లాడదాం. నువ్వు నాకు ఎన్నిసార్లు మర్లబడ్డవో, ఎన్నిసార్లు నా ఇజ్జత్ దీసినవో నేనూ చెప్పుకుంట."

"చెప్పు. నువ్వు చెప్పేది నువ్వు చెప్పు. నేను చెప్పేది నేను చెప్పుత. ఇద్దరం చెప్పింది విన్నంక వాళ్ళేం చెప్పుతరో, యేం తీర్పిస్తరో విందాం. నేనైతే వాళ్ళు చెప్పినట్టు వింటా."

"నేను కూడా వాళ్ళు చెప్పినట్టు వింటా. రమ్మను... రేపే రమ్మను. తాడో పేడో తేలిపోతది."

"వాళ్ళు మనొక్కరి కోసమే వస్తలేరు. ఊళ్ళె సమస్యలు చాలా ఉన్నయి. గవన్నీ మాట్లాడెటందుకే వస్తున్నరు."

"రానీయ్, అన్నలంటే నీ వోళ్ళే అనుకోకు. నా వోళ్ళు కూడా వాళ్ళే."

"వాళ్ళు నీ వోళ్ళు కారు. నా వోళ్ళు కారు... అందరోళ్ళు."

... ... ...

ఆ మర్నాడు అర్థరాత్రి ఊరి చివర్లో ఉన్న మోహన్ ఇంటిమీద పోలీసులు దాడి చేశారు.

"ధాం...ధాం.." అన్న రైఫిళ్ళ మోతతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది.

ఓ అరగంటసేపు ఇరువైపుల నుంచి కాల్పులు సాగాయి.

కాల్పులు ఆగిపోయిన అరగంట తర్వాత పోలీసులు సెర్చిలైట్లతో మోహన్ ఇంట్లో ప్రవేశించారు.

వాళ్ళకు రక్తం మడుగులో మూడు శవాలు కనిపించాయి.

అందులో ఓ స్త్రీ శవం కూడా ఉంది. శవంగా మారిన ఆ స్త్రీ మోహన్ భార్య జ్యోతి.

ఆ మర్నాడు అన్ని వార్తాపత్రికలు వరంగల్‌కు పదికిలోమీటర్ల దూరంలో ఉండే తీగారం అన్న గ్రామంలో పోలీసులకు, తీవ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు తీవ్రవాదులు మరణించారని, చనిపోయిన తీవ్రవాదుల్లో ఓ స్త్రీ కూడా ఉందని పోలీసులు తెలియజేశారని ఫోటోలతో సహా ప్రముఖంగా ప్రచురించాయి.

( ఇండియాటుడే, 22 సెప్టెంబరు 1998)